# ముట్టుకొట్టుకి తాళంకప్ప

ఎస్. కామేశ్వరరావు.

వెంకన్నపంతులు వుత్తి చవటదద్దమ్మ అంటే నమ్మండి. పెళ్లాం యెలాగ చెప్తే అలాగ అక్షరాల నడుచుకునేవాడు చవట కాకపోతే మరేమిటి? ఆమె చెప్పినట్టు చెయ్యకపోతే ఆమహా యిల్లాలికి కోపం వస్తుందేమోనని కాబోలు అతని భయం. మొగుడి అనువు కనిపెట్టి తన చేతిలో కీలుబొమ్మలాగ త్రిప్పుకుంటూంది భార్య శోధమ్మ.

వెంకన్న పంతులు యింతో అంతో చదువుకున్నవాడు; వుద్యోగం చేస్తూ వున్నవాడు అయివుండి, యెంత పెళ్లాం బెల్లం ముక్క అయినాను అంత నెత్తినెక్కించుకోవడమేమిటి? అదేమిటో ఆ అమాయకుడు మొదటినుంచి భార్యకి లోకువ అయిపోయినాడు. మొక్క అయి వున్నప్పుడు వంచకపోతే మ్రాను అయినప్పుడు వంగుతుందా! ఆవిడ చెప్పినట్టు చెయ్యకపోతే తన అవసరాలకి దగ్గరకు రాదేమో! వెధవధి! పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని మొగుడొక మొగుడా! కర్ర మొద్దేకాని.

యీ మధ్యను విశాఖపట్నంలో దొంగలడావుడి జోరుగా వుందని శోధమ్మకి బుచ్చమ్మ అత్తిక చెప్పిందట. ఆ మాటపట్టుకొని మొగుడి దగరకి గబగబా పరుగెత్తుకు వచ్చి, "యేమండీ! వూళ్లో దొంగతనాలు హెచ్చు పెరుగుతున్నాయట కదా! ఆ సంగతి నాతో చెప్పనైనా చెప్పేరు కాదే! అంత మందమతయితే యెలాగండీ!" అంది, చేతులు తిప్పుకుంటూను.

"ఆ!....మనయింట్లో ఏముందే యెత్తుకుపోవడానికి! అనవసరంగా నీ మనస్సుకి యెందుకు నొప్పి కలిగించడమూ అని వూరుకున్నాను" అన్నాడు బీరువా డ్రాయరు లోపుకితోస్తూ వెంకన్న.

"బాగుందండీ! మీమాటలూ మీరూను! మొన్న పండుక్కి కొన్న జరీచీరె ముట్టుకట్టలో వుండిపోయింది. ఆ మూట వీధి కొట్టులో పెట్టానుకదా! యెవరైనా తీసుకుపోతేనో!"

"అయితే నన్నేమి చెయ్యమంటావు?"

"యేంచెయ్యమంటాను! నెత్తిని చేతుల్పెట్టుకొని కూర్చోండి, బాగా బోధపడుతుంది! మొగాడయివుండీ కొంచమైనా యింటి జాగ్రత్త తెలియకపోతే యెలాగండీ! అన్నీ నేనెంతకని చెప్పగలను, ఆడదాన్ని!

యిదుగో! మన యినపతాళం తీసుకొని వెళ్ళి ఆ కొట్టుకి వేసిరండి, యెందుకేనా మంచిది."

"బాగుందే నీ వాలకం. ముట్టుగుడ్డలు యెవడికి కావాలే! అన్నింటికి చాధస్తం ఓడకుసుమా నాకు అసహ్యం!"

"మీకు అసహ్యం అయితే నాకేమీ అసహ్యంలేదు. దొంగాడికి అదీయిదీ అన్న భేదమేమిటి? చేతికి యేది దొరికితే అదే పట్టుకుపోతాడు. వూళ్ళో దొంగతనాలు చాలా తమాషాగా జరుగుతున్నాయట. యివ్వాళ బుచ్చమ్మ అత్తిక చెప్తూవుంటే నాగుండెల్లో దడపట్టుకుంది. నాలుగు రోజుల కిందట గౌడు వీధిలో దొంగలుపడి ఒక యింట్లో మొగుడూ పెళ్ళాం పడుకుంటే ఆ మొగాడిని కాళ్లు చేతులు కట్టేసి, పెళ్ళాన్ని సుభ్రంగా దోచుకున్నారు. మీకేమి పోయింది? మొన్న పండుక్కి మా అమ్మ కొనియిచ్చిన పట్టుచీరె ఆ బట్టల్లోవుండి పోయింది. యెవరన్నా పట్టుకుపోతే మళ్ళీ మీరు కొనగలరా యేమన్నానా. నా అదృష్టంకొద్దీ ఆ చీరె ఆ కట్టలో వుండి పోయింది. వెళ్ళి తాళంనొక్కిరండి" అంది చీదరించుకుంటూ శోధమ్మ.

పాపం! పెళ్ళాం చెప్పినట్టూ తాళం వెయ్యక తప్పిందికాదు వెంకన్న పంతులుకి.

ఆ రోజు మధ్యాహ్నం భోజనంచేసి మామూలుగా ఆఫీసుకి పోయేడు వెంకన్న పంతులు.

అతను అలాగ సందు మలుపు తిరగ్గానే ఒక వ్యక్తి వాళ్ళగుమ్మంలోనికి వచ్చి తలుపు గుద్దుతున్నాడు. "శోధమ్మగారూ! శోధమ్మగారు! తలుపుతియ్యండి" అంటూను.

యెవరో తలుపుగుద్దుతున్నారని ఆవిడ తలుపు తీసి, "యెవరోయినువ్వూ!" అని అడిగింది.

"నేనమ్మా! తోటపాలెం చాకలివాడిని. బాబుగారు త్రోవలో కనిపించి, 'ఓరే! అప్పిగా! ముట్టుబట్టల మూట ఒకటి వుండి పోయిందిరా మాయింట్లో, కాస్త వుతికి పెడుదూ పావలాడబ్బులిస్తాను. మా చాకలి వాడు బల్లలపండుగ అయితేకాని రాడుట, అంటే బాబుగారిమాట కాదనలేకవచ్చేను. ఆ బట్టలు యెక్కడవున్నాయో చూపిస్తే తీసుకుపోతాను' అన్నాడు.

పాపం! ఆ యిల్లాలు నిజమేకాబోలు అనుకుంది.

"అయితే యిలారారా!" అంటూ కొట్టు తాళంతీసి, అదిగో ఆ గోడకి తగిలించిన మూట జాగ్రత్తగా తీసుకో, అని చెపుతూ వాడికి ఆ బట్టలు చూపెట్టింది.

"చిత్తం! అమ్మా! రేపు వుదయాన్నే వుతికేసి తీసుకొని వస్తాను" అంటూ ఆ మూట కాస్తా చంకను పెట్టుకొని వుడాయించేడు.

రాత్రి మొగుడు యింటికివచ్చిన తరువాత జరిగిన సంగతంతా చెప్పింది శోధమ్మ.

"నేనెవరినీ పంపించలేదే" అన్నాడు! అతను ఆశ్చర్యంగా ముద్దనోట్లో పెట్టుకుంటూను.

"అదేమిటండీ అలాగ అంటారు! యెవరో తోటపాలెం చాకలివాడుట. మీరుపంపేరని చెప్పి మూటపట్టుకువెళ్ళేడు."

"మంచిపనిచేశావు. అన్నిసీతులూనువ్వే నాకు చెప్పి ఆ గోతిలో నువ్వేపడ్డావూ? వాడు యెవడో దొంగముండాకొడుకు మళ్లేవున్నాడు. నిన్ను దగాచేసి ఆ కట్టపట్టుకొని పోయాడు."

"అయ్యో! అయ్యో! నాకర్మంకాలా! అయితే యింకా అలాగచూస్తారేం! ఆ రెండుముద్దలూ నోట్లోపెట్టుకొని పరుగెత్తి వెళ్ళి పోలీసుస్టేషనుకి చెప్పండి. యాభైరూపాయిల చీరె వాడియధాన కొట్టేను. వేగిరం వెళ్ళి పోలీసులకి చెప్పితే వాడు యెక్కడ వున్నాడో వెతికి పట్టుకుంటారు." అంది కళ్ళు తుడుచుకుంటూ శోభమ్మ.

"నీ మొగం! పూరూలేదు పేరూలేదు. పోలీసులకి యేమని రిపోర్టు యివ్వడం వాళ్ళకికూడా కాఫీకర్చులు దండుగ. పోయిందేదో పోయింది యింకనోరు మూసుకొని వూరుకో. యెంత పెళ్ళామైనాను! తాడుకట్టిన మొగుడు అవునా! వాడిమాట శాస్త్రఅయినా వినకపోతే! మరేమి అవుతుంది? ఆచీరె నువ్వుకట్టుకున్నప్పుడే చెప్పాను, ఒకరోజు సరదాకి కట్టుకొని పెట్లో పెట్టేసుకొమ్మని. అలాగచేసా? పూరందరికీ మీవాళ్ళు యిచ్చినచీరె చూపెట్టాలని యెహార్భానికొద్దీ నాలుగు రోజులు కట్టుకొని తిరిగేవు. నీఅదృష్టం కొద్దీ దానితోటే బైటవున్నావు. యేంచేస్తాము! మనకి ప్రాప్తంలేనివస్తువులు అలాగేపోతాయి" అన్నాడు, చెయ్యి కడుగుకుంటూను.


# రీటా హెయిర్ టానిక్



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోటా దొరుకును.

**RITA**
**HAIR TONIC**

